కథానిక:

# అద్దె యిల్లు

"ఇలా హోటలు కాపరం ఎన్నాళ్లు నిర్వహిస్తావురా అబ్బాయీ? రోజుకు రూపాయిన్నరంటే మాటలా? నీకొచ్చే ఎనభై రూపాయిల్లో!" గట్టిగానే మందలించారు వాత్సల్యంతో లాయరు సర్వేశ్వర్రావుగారు కొత్తగా కాపరంతో బస్తీకి జేరిన కృష్ణమూర్తిని.

"ఏంచెయ్యను బాబాయి! ఇంత బస్తీలో తలదాచుకోటానికి బెత్తెడు జాగా దొరకదాయెను. నెలకు యాభై అరవై చొప్పున వందలూ వేలూ అడ్వాన్సులు కుమ్మరిస్తే వాటితో యిళ్లుకట్టించి యిస్తారట! మీవంటి పలుకుబడిగలవాళ్లు ఉండికూడా ఇంత నీడ చూపించలేరాయెను!!" ఎదురు నిష్ఠురం విసిరాడు కృష్ణమూర్తి చనువుతీసుకొని.

లాయరుగారు కొంచం తటపటాయించి, "అవున్రా, అదే చూస్తున్నాను 'అబ్బాయికి మావూళ్లో వుద్యోగమైంది, కొత్తగా కాపరం తెస్తున్నాడు.

అక్కడ మీకంటె ఆప్తులు మరెవరూ లేరు. వాళ్ళను కాస్త కనిపెట్టి ఉండండని నాన్న రాసిన వుత్తరం చూచిందాకా మీరక్కడ వున్నట్టే తెలియదు! ఏం యకాయకి మాయింటికి వచ్చెయ్యక పోయినారూ? మేమేం పరాయివాళ్ళముట్రా? నాన్నకూ నాకూ ప్రాణస్నేహం, తెలుసా? హోటలుకు అద్దెకట్టేసి రండి. ఇల్లు దొరికిందాకా మాతోనే వుందురుగాని." కన్నతండ్రికంటె ఎక్కువ యిదిగా పరామర్శించారు.

"ఎందుకులెండి మిమల్నిబ్బందిపెట్టటం? ఏదో ఓయిల్లు చూచుకొన్నదాకా యిలానే తిప్పలుపడతాం" కృతజ్ఞత తెలిపాడు కృష్ణమూర్తి తమ విషయంలో ఆయన తీసుకొంటున్న శ్రద్ధకు.

"నీమొహంగాదూ! ఇబ్బందేమిటి మనలో మనకు; వెంటనే వచ్చెయ్యండి."

ప్రేమతో పిలుస్తుంటే కాదనలేకపోయినాడు కృష్ణమూర్తి. సాయంత్రమే బండి కట్టించుకొని బయల్దేరారు దంపతులు, చెప్పిన యింటి అడ్రస్ సరిచూసుకుంటూ.

అల్లంతదూరాన చూస్తూనే ఎదురొచ్చి "రండర్రా! మీకోసమే చూస్తున్నానూ. మీరొస్తున్నారంటే మీపిన్ని ఎంతసంతోషపడ్డదనుకున్నారూ! 'పాపం పసివాళ్లు' ఒంటరిగా ఎక్కణ్ణో విసిరేసినట్టుంచమేమిటే వాళ్ళను; మంచిపని చేశారు! యిబ్బందైతే కానివ్వండి అలానే సర్దుకుందాం; వాళ్ళ యిబ్బంది ఒకటే మన యిబ్బంది ఒకటేనా? అని అప్పటికప్పుడు పనిమనిషిని పిలిపించి స్వయంగా దగ్గిరుండి కడిగించింది యిల్లు! ఏమే! మనవాళ్లొచ్చారు తీసుకెళ్లి యిల్లదీ చూపించు!!" ఆజ్ఞ యిచ్చాడు అర్ధాంగికి.

ఆమె సొంత కోడల్ని చూసుకొన్నట్టు పరవశమే ఐపోయింది! "రావే చిట్టితల్లీ

రచన:
"జయ"
మూలం: శ్రీ వై. యం. శర్మ

యిల్లు చూచుకుందువుగాని" ఆ ఆపేక్షకు పొంగిపోయిందా లేతజంట.

"యిల్లు చూశారా? పెట్టెలే ఎలా వుందోనూ? చిత్రమేమిటి తెలుసా? ఈ యిల్లు వేసవికాలం చల్లగా వుంటుంది, చలికాలం వెచ్చగా వుంటుంది! ఎప్పుడన్నా ఉక్కపోస్తే ఎలెక్ట్రిక్ ఫాన్ వుండనే వున్నది, మరో ఐదురూపాయలు మనవి కావనుకుంటే సరిపోయె! ఇదే యింకోళ్ళయితే యాభైకి దమ్మిడీ తక్కువ తీసుకోరీ రణబస్తీలో. శీతం రాగానే ఓ యిరవై అవతల పారేస్తూ హాయిగా వుండండి!" అరచేతులో వైకుంఠం చూపిస్తూ వర్ణించుకుపోయింది చీకటి గుహ్యారమైన గరాజిని!

నిలువ నీడ దొరికినందుకే సంతోషించారు కృష్ణమూర్తీ సరితానూ! గరాజికి సరిగ్గా ఉత్తరదిక్కున కక్కసు. ఏ కొంచెం గాలి వచ్చినా మక్కులు సగిలిపోతున్నై. ఇంటికి ముందూ ప్రక్కనా మురుగుకాలవ ఊరకలపెడుతుంటుంది మూడువందల అరవై రోజులూ జీవనది గంగాప్రవాహంలా. గరాజికి వెనకగానే కక్కసుకు పోయేసందు వుంటటంవల్ల అటువైపు మగవాళ్లు వెళ్తున్నప్పుడల్లా దొడ్డితలుపు మూసుకోవలసి వచ్చేది సరితకు. ఎలాగో సర్దుకుపోవాలిగాని పరాయివూరొచ్చి మనయింటిదగ్గిరికిమల్లే అన్ని వసతులూ కుదరాలంటే ఎలాగ?

ఒకనాటి సాయంత్రం ఉబుసుపోటానికని సరిత తన చిన్నతనంలో సరదాకనేర్చుకున్న త్యాగరాయకృతి ఒకటి పాడటమొదలుపెట్టేసరికల్లా ఇంటాయన పరిగెత్తుకొచ్చి

"ఈకాలపు పిల్లలకు మంచీ చెడ్డా తెలియదు మరీనీ! పరాయియింటికి వచ్చినప్పుడు అవతలవాళ్లేమనుకొంటారో అన్న జ్ఞానన్నా లేకుండా ఈ అల్లరేమిటి? చెవులు పగిలిపోయేట్టు? ఐనా సంసారం జేసుకొనేవాళ్ళకు సంగీతాలేమిటి సినిమావాళ్ళకుమల్లే!" అన్నది. ఆమెలా అణగివున్న అత్తగారి అంశకు హడలిపోయి కృష్ణమూర్తి రాగానే చెప్పుకొని వెక్కి వెక్కి ఏడిచింది సరిత. ఏమైతేనేం అంత పుత్రవాత్సల్యంతో పిలుచుకువచ్చిన పెద్దమనిషిని యెదటిబడి అడిగేందుకు సాహసించలేకపోయింది, గుమాస్తాగిరికి అంకితమైపోయి కృష్ణమూర్తిమనస్తత్వం.

బస్తీతిండి పడకనో మురుగుకాలవలో సావరం ఏర్పరచుకున్న దోమలకు నిత్యనైవేద్యం జరుగుతుండటంవల్లో తెలియదుకాని వంతులువేసుకుని జబ్బులుపడుతున్నారు కృష్ణమూర్తీ అతని భార్యానూ!

ఒకరోజు కృష్ణమూర్తిని డాక్టరు పక్కకు పిలిచి—

"ఈ యింట్లో మరో నెల ఉంచితే నీ భార్య బతకదని నిర్మొహమాటంగా తెగేసి చెప్పి చెక్కేసినాడు!

విధిలేక నౌకరీకి సెలవుపెట్టి రెంటు కంట్రోలు ఆఫీసరుచుట్టూ తిరిగి పైసంత

ప్వరలో ఏదో ఒకయిల్లు కుదిర్చి యిప్పించ మని మరీమరీ ఒతిమాలి చెప్పివచ్చాడు. పాపం ఆయన ఏగుణానున్నాడో వారం రోజుల్లోనే యిల్లు కేటాయించి కబురు చేశాడు.

విడిగా యిల్లూ, తోటా, దొడ్డీ, దొడ్లో మంచినీటి పంపూ, ఆఫీసుల్లుండేందుకు తగట్టుగా వుంది, అద్దె యిరవైయేదు! శని జరిగిందని సంతోషించాడు కృష్ణమూర్తి. భార్యచూసి మొదట బాగానేవుందన్నది గాని ఇంట్లో తీరా జేరినతరువాత నసుగుడు మొదలుపెట్టింది.

"ఇందులో ఏదో తిక్కుడి వుందండీ! ఇంతయిల్లు పాతికరూపాయల కెవరన్నా యిస్తారుటండీ?"

రానురాను ఆవిడ కాయింట్లో దయ్యాలు కనుపించటం, పీక్కుతింటామని బెదరించటం, దానికితగ్గట్టు ఆయింట్లో చేరిన నెలతిరిగే లోగానే ఆమె ముత్తవతల్లి చచ్చిపోవటం అన్నీకలిసి అది దయ్యాలకొంపే అని ఆమెకు సాక్ష్యం పలికినై!

"ఈ యింట్లో ఒక్క క్షణం వుండొద్దు మనం! పోదాం పదరండి మరెక్కడికన్నా, మీకు పుణ్యముంటుంది." అని ఊదర పెట్టింది సరిత!

"అద్దె యిచ్చినప్పుడు పుచ్చుకుంటు న్నారు, ఏ గొడవా లేకుండా మనం తట్ట మనం హాయిగా బతుకుతున్నాం! ఈ వసతి యింకో చోట రాదు!" ఎంతో ప్రయ త్నించాడు కృష్ణమూర్తి వద్దని నచ్చ జెప్పేందుకు.

"అయ్యో! మీపిచ్చి బంగారంగానూ! ఇంట్లో ఏతిరుగుడు లేకపోతే నెల కొంగానే అద్దెటకాయించి పుచ్చుకోరుబండీ? ఇంత అమాయకులేమండీ! మీకు చక్కని కొటుక వేశారు. ఇది దయ్యాలకొంపని స్పష్టంగా తెలబడుతుంటేనే! చాల్లెండి, ముందు మరో కొంప చూడండి పోదాం అవతలబడి."

కాలికి గలపం కట్టుకు తిరుగుతూనే వున్నాడు కృష్ణమూర్తి! యిల్లు బాగుంటే దొడ్డి చాలకా, దొడ్డివుంటే దీపాలు లేకా, దీపాలుంటే వెలుతురు లేకా అన్నీవుంటే దిక్కులు సరిపోకా ఒకటే నచ్చలేదు!

ఊరికి వెలపల కొంచెం దూరంగా ఒక విశాలమైన యిల్లు కనిపించింది. గాలి గోడలూ, దాబాగదులూ, కిటికీలకు అద్దాల తలుపులూ ఎలక్ట్రిక్ లైట్లూ నటిస్తాయిలా చూడ ముచ్చటగా వుంది! "అద్దెకు" అని బోర్డుకూడా వుంది!! ఆలస్యమైతే మించి పోతుందని యజమానియిల్లు కనుక్కొని వెంటనే పరిగెత్తి తలుపుతట్టాడు కృష్ణమూర్తి.

"ఎవరండీయింట్లో?"

"ఎందుకు బాబూ?" నలభై యేళ్ల ఆడ గొంతు పలికింది.

"ఇల్లద్దెకిస్తారాండి?"

"అబ్బె లేదు! ఎవరికి కావాలి?"

"మాకే."

"ఎంతమంది మీరు?"

"ఇద్దరం!"

"ఇంతేగదా! ఈ యిల్లు మాకిందే వుంచు కుంటాం. అవతల మరో యిల్లుంది. చక్కగా గాలీ వెలుతురూ, కమ్మని మంచి నీరూ మంచి వసతైన యిల్లులే!"

"కొంచం పెడగా వున్నట్టుందండీ వూరికి!"

"ఏమిటో! ఊళ్లోఉండి గాలీ వెలుతురూ లేని యిళ్లల్లో యిలా కుమిలిపోవటం చూస్తూనే యింటిమీద మరో యిల్లు ఇక్కణ్ణే ఎలా కట్టం చెప్పు బాబూ!"

"అద్దె యెంతేమిటండీ?"

"ఎంతో అంత యిద్దువుగానిలే నాయనా, డబ్బు శాశ్వతమా ఏమిటిగనక! నిలబడే వున్నావు కూచో! మంచి నీళ్లేమన్నా కావాలా!" ఎంతో ఆపేక్షగా పరా మర్శించింది

"మీకైతే యిద్దరేగనక క్షేమంగా సరి పోతుంది! మంచిరోజు చూసుకొని దిగండి! స్వామిచల్లగా చూసి మీకడుపున ఓ కాయ గాస్తే ఎప్పుడన్నా వచ్చి ఎత్తుకుంటాను."

ఉంటారుగావును ప్రపంచంలో దయగల వాళ్ళుకూడా!

"ఎన్నాళ్లయిందండీ ఇల్లు ఖాళీ అయి?"

"ఎన్నాళ్లెక్కడిది నాయనా? రొణ్ణాళ్లే! వందలనుండి వచ్చిపోతున్నారు!! ఆఫీసులు తెరిచే రోజులుగాదూ. జనం గిజగిజలాడి పోరికనూ యిళ్లు దొరక్క? కాస్త ఉద్యోగులుగా, మంచివాళ్ళనుగా చూసి యిద్దామని శుభ్రంగా కడిగిపెట్టి వుంచాం.

"ఇదివరకెవరుండేవారండీ ఆ యింట్లో?"

ఆదరంగా యిల్లిచ్చి వుండమంటుంటే ఇలా విషమప్రశ్నలు వేస్తున్నందుకు పాపం ఆ యిల్లాలు చాలా నొచ్చుకున్నది.

"మొన్నటిదాకా గవర్నమెంటువారి కిందే వుంది నాయనా అది!"

"ఏమిటో ఆ ఆఫీసు" కృష్ణమూర్తి ప్రశ్నకు అంతు కనబట్టం లేదు. వుండబట్ట లేక అడిగేసింది.

"సుఖంగా వచ్చి చేరక, ఎందుకు బాబూ యీ ప్రశ్నలన్నీనూ?"

"ఊరికనే తెలుసుకుందామని."

"ఏదో యింగ్లీషుపేరు నాయనా ఆ ఆఫీసు నోరు తిరగటంలేదు, పోస్టాఫీసా? ఏమిటే అది అమ్మాయి?"

"పోస్టుమార్టం!" చిరునవ్వు నవ్వింది పదహారేళ్ళ పడుచుపిల్ల, కూతురుగావును.

నిలువుగుడ్లుబడ్డ కృష్ణమూర్తి అలాగే నిలబడిపోయినాడు!



అఖిలభారత దిగంబర్ జైనమహాసభవారు ఏప్రెల్ 16 న రిపబ్లిక్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌గారికి న్యూఢిల్లీలో సన్మానంచేసినప్పటి దృశ్యం.